క్లుప్తంగా

గ్రామాభివృద్ధికి సహకరించండి


ఎమ్మెల్యే సబితారెడ్డితో కొత్తగూడ వాసులు

కందుకూరు: మండల పరిధిలోని కొత్తగూడ గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరుతూ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ సామ ప్రకాశ్ రెడ్డి ఆధ్వర్యంలో స్థానిక నాయకులు శనివారం ఎమ్మెల్యే సబితారెడ్డిని ఆమె నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా వారు పలు సమస్యలు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. గ్రామంలో అంగన్‌వాడీ భవనంతో పాటు సీతారామశాస్త్రి నగర్‌లో సీసీ రోడ్లు, భూగర్భడ్రైనేజీ నిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. వైఎస్‌ఆర్ మినీ స్టేడియాన్ని వినియోగంలోకి తీసుకొచ్చేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే సబితారెడ్డితో మొర పెట్టుకున్నారు. ఈ విషయంలో సానుకూలంగా స్పందించిన ఆమె గ్రామాభివృద్ధికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉప సర్పంచ్ బొక్క సత్యనారాయణరెడ్డి, యూత్ నాయకులు తాళ్ల కార్తిక్, బొక్క దీక్షిత్‌రెడ్డి, బొక్క శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే సబితారెడ్డి రాక

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని పలు డివిజన్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించేందుకు ఆదివారం మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే సబితారెడ్డి హాజరుకానున్నారని బీఆర్‌ఎస్ కార్పొరేషన్ అధ్యక్షుడు రామిడి రాంరెడ్డి తెలిపారు. అల్మాస్‌గూడలోని 26వ డివిజన్, తిరుమలనగర్‌లోని రామిడి కళావతి స్మారక భవనం ప్రారంభోత్సవంతో పాటు పలు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిశీలిస్తారు. అలాగే నాదర్‌గుల్‌లోని 9వ డివిజన్‌లోని చాణిక్యపురి కాలనీ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగు సమావేశంలో పాల్గొంటారని పేర్కొన్నారు.

సమయం వృథా చేయొద్దు

విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ


విద్యార్థులకు పట్టా, సర్టిఫికెట్లు అందజేస్తున్న లక్ష్మీనారాయణ, తీగల కృష్ణారెడ్డి

మీర్‌పేట: మారుతున్న కాలానుగుణంగా మార్పు అవసరమని, లక్ష్య సాధనకు సమయం వృథా చేయకుండా ముందుకు సాగాలని విశ్రాంత ఐపీఎస్ అధికారి లక్ష్మీనారాయణ విద్యార్థులకు సూచించారు.శనివారం మీర్‌పేట టీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో గ్రాడ్యుయేషన్ డే వేడుకకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థి దశలోనే ఆలోచించి అడుగు వేయాలని, ప్రస్తుతం స్మార్ట్ ఫోన్‌లు, ఇంటర్నెట్ సాంకేతిక పరిజ్ఞానంతో ఎన్నో విషయాలు తెలుస్తున్నాయని, కొత్త విషయాలపై పట్టు సాధించేందుకు ఎప్పటికప్పుడు సిద్ధంగా ఉండాలన్నారు. మంచి స్నేహితులను ఎంచుకోవడంతో పాటు సమయానుకూలంగా చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. అనంతరం కళాశాల చైర్మన్, మాజీ ఎమ్మెల్యే తీగల కృష్ణారెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డిలు మాట్లాడుతూ జీవితంలో స్థిరపడ్డాక తల్లిదండ్రులను ఎల్లప్పుడూ గౌరవించుకోవాలన్నారు. చదువుతో సంపాదించిన డిగ్రీలతో పాటు విలువలు ఎంతో అవసరమని గుర్తుచేశారు. అనంతరం విద్యార్థులకు పట్టా, సర్టిఫికెట్లు అందజేశారు. కళాశాల సెక్రటరీ తీగల హరినాథ్‌రెడ్డి, కోశాధికారి అమర్‌నాథ్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు ఎంపీ ఈటలకు సన్మానం

ఎల్‌బీనగర్: పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన ఈటల రాజేందర్‌ను నేడు (ఆదివారం) సన్మానిస్తున్నట్లు ఎల్‌బీనగర్ పద్మశాలి సంఘం సభ్యులు తెలిపారు. శనివారం వనస్థలిపురంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..ఆటోనగర్‌లోని కర్నాటి గార్డెన్‌లో సన్మాన కార్యక్రమం ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ప్రభాకర్‌నేత, కర్నాటి ధనుంజయ, పట్టపర్తి జ్ఞానేశ్వర్, చేరుపెల్లి వర్ధలీల, కర్నాటి మాధవి, ప్రభాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్ విజయవంతం చేయాలి

ఎల్‌బీనగర్: పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే చెల్లించాలని ఎస్‌ఎఫ్‌ఐ ఎల్‌బీనగర్ కార్యదర్శి మీసాల స్టాలిన్ డిమాండ్ చేశారు. శనివారం ఎల్‌బీనగర్ ఏర్పాటు చేసి సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 22న చేపట్టిన చలో కలెక్టరేట్ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. ప్రభుత్వం ఏర్పాటై ఏడు నెలలు గడుస్తున్నా విద్యాశాఖ మంత్రి లేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో సంధ్య, అరుణ్, సాయి, వంశీ, నవీన్, రమేష్, పవన్, శివ పాల్గొన్నారు.

చినుకులతో కునుకు కరువు!

చిన్నపాటి వర్షం వచ్చిందటే ఆ కాలనీల వాసులకు కంటిమీద కునుకు కరువవుతోంది. గత పదేళ్లుగా కాలనీవాసులు సమస్యలపై పోరాటం చేస్తున్నా ఏ ఒక్కరూ స్పందించడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముంపునకు గురైనప్పుడు పరిశీలనకు వచ్చి ప్రజాప్రతినిధులు హామీలిస్తున్నారు తప్ప.. చిత్తశుద్ధితో అమలు చేయటం లేదని మన్సూరాబాద్ డివిజన్ హిమపురికాలనీ ఫేజ్–2 వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

–మన్సూరాబాద్


హిమపురికాలనీలోని గుంతలమయంగా ఉన్న మట్టిరోడ్డు


కాలనీలో ప్రవహిస్తున్న వరద (ఫైల్)

అటవీశాఖ స్థలం నుంచి వచ్చే నీటితోనే..


జడ్జెస్, సహారాస్టేట్స్‌కాలనీల మీదుగా వచ్చే వరద నీటితో పాటు ఆటోనగర్ నుంచి వచ్చే వరద కలిసి కాలనీలోని రోడ్ల గుండా పారుతూ ఇళ్లను ముంచెత్తుతుంది. అటవీశాఖ స్థలం నుంచి వచ్చే వరద నీటిని కాలనీలోకి పారేలా అటవీశాఖ ఏర్పాటు చేసిందని, దీంతో వరద ఎక్కువై కాలనీని ముంచెత్తుతుంది. హిమపురికాలనీ నుంచి డబుల్ బెడ్రూమ్ వరకు వరదకాలువ ఏర్పాటుకు నిధులు మంజూరయ్యాయని గత ఆరు నెలల క్రితం ప్రారంభోత్సవం చేశారు. కానీ ఇంతవరకు పనులు చేపట్టలేదు. ఇప్పటి వరకు కాలనీలో సీసీ రోడ్డు, బీటీ రోడ్డు కాని వేయలేదు. జీహెచ్‌ఎంసీకి పన్నులు చెల్లిస్తున్న అభివృద్ధి మాత్రం చేయటం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సొంత నిధులతో మరమ్మతులు..

కాలనీవాసులే సొంత నిధులతోనే రోడ్లకు మరమ్మతులు చేసుకుంటున్నారు. వర్షం వస్తే మట్టి కొట్టుకపోయి మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయి. కాలనీలోని ఓపెన్ స్థలాల్లో రాత్రి సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు భవన నిర్మాణ వ్యర్థాలు డంప్ చేస్తున్నారు. కాలనీలో వీధి దీపాలు లేకపోవడం చీకటి పడిందంటే విష సర్పాల భయంతో ఇంట్లో నుంచి కాలనీవాసులు బయటకు రాలేని దుస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి కాలనీని అభివృద్ధి చేయాలని వారు ముక్తకంఠంతో కోరుతున్నారు. ఆటోనగర్ నుంచి వచ్చే రసాయన వ్యర్థాలు, పై కాలనీల డ్రైనేజీ మురుగు వరదనీటిలో కలిసిపోయి ప్రవహిస్తుండటంతో తీవ్ర దుర్వాసన వస్తుంది. రసాయన వ్యర్థాలతో చర్మ సంబంధిత వ్యాధులు సోకడంతో ఆస్పత్రులకు పరుగులు తీయాల్సి వస్తోందని కాలనీవాసులు వాపోతున్నారు.

ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్


మాట్లాడుతున్న డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్

శంకర్‌పల్లి: ల్యాబ్స్‌లలో డెంగీ, మలేరియాలు పాజిటివ్ అని తెలితే మండల వైద్యాధికారికి సమాచారం ఇవ్వాలని, ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని డిప్యూటీ డీఎంహెచ్‌ఓ దామోదర్ అన్నారు. శనివారం శంకర్‌పల్లి, టంగటూర్ పీహెచ్‌సీ పరిధిలోని ల్యాబ్స్ యాజమానులతో సమావేశమయ్యారు. సీజనల్ కాలంలో రోగులకు చేయాల్సిన పరీక్షలపై ఆయన పలు సూచనలు చేశారు. ఒక రోగికి ఒకసారి డెంగీ పరీక్షలో పాజిటివ్ అని తెలితే రెండోసారి పరీక్ష చేసిన తర్వాతే నిర్ధారణకి రావాలన్నారు. గుర్తింపు లేని డాక్టర్లు ఇచ్చే పరీక్షలకు ల్యాబ్స్, మెడికల్‌వారు మందులు ఇవ్వొద్దని కోరారు. ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, లేకపోతే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో శంకర్‌పల్లి మండల వైద్యాధికారి రేవతిరెడ్డి, సిబ్బంది గోపాల్ రెడ్డి, బాబురెడ్డి ఉన్నారు.

19నుంచి ఉచిత కంటి వైద్య శిబిరం

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ జిల్లా వెల్దండ మండల కేంద్రంలోని ఏవీఆర్ ఫంక్షన్‌హాలులో ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19నుంచి 27 వరకు ఉచిత మెగా కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. ఆమనగల్లు పట్టణంలో శనివారం ఐక్యత ఫౌండేషన్ మెంబర్ సుంకిరెడ్డి వరప్రసాద్‌రెడ్డితో కలిసి రాఘవేందర్‌రెడ్డి ఉచిత మెగా కంటి వైద్య శిబిరం పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ చెన్నై శంకర నేత్రాలయ ఆసుపత్రి సౌజన్యంతో ఉచితంగా ప్రజలకు కంటి పరీక్షలు నిర్వహించనున్నట్లు చెప్పారు. అవసరమైన వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. అనిల్‌గౌడ్, సైదులు, శేఖర్, బాలరాజు, అంజి, లక్ష్మణ్, నరేందర్, వెంకట్‌రెడ్డి, వెంకట్‌నాయక్, యాదగిరి పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయులే కీలకం

మొయినాబాద్‌రూరల్: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమని విశ్వకర్మ మండల గౌరవ అధ్యక్షుడు వడ్ల నర్సింహ్మాచారి, కాంగ్రెస్ మండల నాయకుడు గోపికృష్ణారెడ్డిలు అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చాలా సంవత్సరాలుగా రికార్డు అసిస్టెంట్‌గా పనిచేసిన ఉపాధ్యాయుడు అబ్దుల్‌ఖాదర్ బదిలీపై వెళ్లడంతో ఆయనకు ఘనంగా వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు స్వరూపా, మంజుల, సంజీవన్, సంగీత, అరుణ, సత్యనారాయణ, అదే విధంగా ప్రాథమిక పాఠశాలలో బదిలీపై వెళ్లిన గిరిజ, మంజులను సన్మానించారు. హెచ్‌ఎం రేణుక, ఉపాధ్యాయులు అలివేలు, మహేశ్వరీ, శంకర్, జ్యోతి, శోభ, లక్ష్మి, వినోద్, కైసర్ అహ్మద్, అశ్విణీ, రాంరెడ్డి, సత్యనారాయణరెడ్డి పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక


పార్టీలో చేరిన వారికి కండువాలు వేస్తున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్ల: మండలంలోని బీఆర్‌ఎస్ పార్టీకి చెందిన పలువురు మండల నాయకులు శనివారం ఎమ్మెల్యే కాలె యాదయ్య సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు తోట చంద్రశేఖర్, దేవునిఎర్రవల్లి గ్రామానికి చెందిన బీసీ సంఘం మండల అధ్యక్షుడు రాములు, ఆలూరు గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ కసిరే వెంకటేశ్‌లు ఉన్నారు. వసంతం, వీరేందర్‌రెడ్డి, డి.వెంకట్‌రెడ్డి, ఆగిరెడ్డి, రాములు, మల్లేశ్, చంద్రయ్య, శ్రీనివాస్‌గౌడ్, పాండుయాదవ్, జనార్దన్, శ్రీను, చెన్నయ్య, సురేందర్, తదితరులు ఉన్నారు.

మీర్‌పేటలో 28న బోనాల ఉత్సవాలు

మీర్‌పేట: బోనాల ఉత్సవాల సందర్భంగా మీర్‌పేట నల్లపోచమ్మ, ఎర్రపోచమ్మ దేవాలయ కమిటీ ప్రతినిధులు శనివారం మీర్‌పేటలో సమావేశమయ్యారు. నగరంతో పాటు ఈ నెల 28వ తేదీన మీర్‌పేట పాత గ్రామం, పరిసర కాలనీల్లో బోనాల ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తీర్మానం చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పల్లె పాండుగౌడ్, వైస్‌చైర్మన్ కీసర గోవర్ధన్‌రెడ్డిలు తెలిపారు.

బందోబస్తు కల్పించాలని వినతి


సీఐ వెంకటేశ్వర్లుకి వినతిపత్రం అందజేస్తున్న మైనార్టీ నాయకులు

మహేశ్వరం: మొహర్రం(పీర్ల) పండుగకు పోలీసుల బందోబస్తు కల్పించాలని శనివారం మహేశ్వరం సీఐ వెంకటేశ్వర్లుకి మైనార్టీ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ నెల 16, 17 తేదీలలో జరిగే పండగకు బందోబస్తు కల్పించి ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా సీఐ బందోబస్తు కల్పిస్తామని మైనార్టీలకు హామీనిచ్చారు.కార్యక్రమంలో జిల్లా మాజీ వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఎంఏ.సమీర్, మొహర్రం ఉత్సవాల కమిటీ మండల అధ్యక్షుడు మహ్మద్ జలాలుద్దీన్, మండల ముస్లిం వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు షేక్ హాజీబాబా, నాయకులు షేక్‌అహ్మద్, హబీబుద్దీన్, మహ్మద్ సలీం, మహ్మద్ మతిన్ పలువురు పాల్గొన్నారు.

కేంద్ర మంత్రితో ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు భేటీ

ఎల్‌బీనగర్: కేంద్ర బొగ్గు గనుల శాఖమంత్రి కిషన్‌రెడ్డిని శనివారం కేంద్ర ఫిల్మ్ సెన్సార్ బోర్డు సభ్యులు కృష్ణాదిశేషు మర్యాదపూర్వకంగా కలిశారు. సినిమాలలో సమాజానికి హాని చేసే దృశ్యాలు, వ్యాఖ్యలను సెన్సార్ బోర్డు ద్వారా నియంత్రించవచ్చు కాని.. ఈ మధ్య సామాజిక మాధ్యమాల్లో అడ్డగోలుగా వీడియోలు పెడుతున్నారన్నారు. వాటిని నియంత్రించకపోతే భవిష్యత్‌లో యువతపై చెడు ప్రభావం పడే అవకాశం ఉందన్నారు. దీనిపై దృష్టి సారించాలని కృష్ణాదిశేషు పేర్కొన్నారు.

మట్టిపోశారు.. సీసీ మరిచారు!


కంకర తేలిన రోడ్డు

- కంకరతేలిన బండలేమూర్ పోర్ల గడ్డ తండా రోడ్డు
- రాకపోకలకు అంతరాయం
- నిలిచిపోయిన పనులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రయాణికులు
- పట్టించుకోని అధికారులు

మంచాల: మూడు జిల్లాల రాక పోకలకు ఆధారమైన రోడ్డు నేడు ప్రయాణానికి ఇబ్బందికరంగా మారింది. దీంతో ఆ దారి గుండా రాకపోకలు నిలిచిపోయాయి. ఈ విషయంలో పట్టించుకునే వారు కరువయ్యారు. నిలిచిపోయిన పనులకోసం ఫిర్యాదులు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. రంగారెడ్డి జిల్లా – యాదాద్రి, నల్గొండ జిల్లాల సరిహద్దు గ్రామాల నుంచి వెళ్లే దారి బండలేమూర్–పోర్ల గడ్డ తండా రోడ్డు. యాద్రాద్రి జిల్లా నారాయణ పూరం మండలం చిల్లా పూరం, కేల్లోత్ తండా, డాగ్ తండా, లచ్చమ్మ గూడం, వాయిలపల్లి, సర్వేల్‌తో పాటు నల్గొండ జిల్లా ఘట్టుప్పల్ మండలంలోని అంతంపేట, సాయి బండ తండా, నామాపూరం, సోమరాజు గూడ తదితర గ్రామాల నుంచి హైదరాబాద్ చేరుకోవడానికి బండలేమూర్ మీదుగా దగ్గర అవుతుంది. దీంతో ఆయా గ్రామాల నుంచి ప్రజలు ఎక్కువగా ఈ రోడ్డు మీదుగానే హైదరాబాద్‌కు వెళ్తుంటారు. ఇబ్రహీంపట్నం డిపో నుంచి ఘట్టుప్పల్‌కు ఆర్టీసీ బస్సు సర్వీసు కూడా ఈ రోడ్డు మీదుగానే వెళ్తుంది. నేడు ఈ రోడ్డు పాడై పోవడంతో రాక పోకలకు అంతరాయం ఏర్పడుతుంది.

గతంలో నిలిచిపోయిన పనులు..!

ఈ రోడ్డు మరమ్మతుల కోసం ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖ కింద రూ.24 లక్షలు మంజూరు చేసింది. 2022 మార్చి 22న పనులు ప్రారంభించారు. వాస్తవంగా ఆరు కిలో మీటర్ల దూరం మట్టిరోడ్డుపై గోతులు లేకుండా మట్టి పోసి రాక పోకలకు ఇబ్బందులు లేకుండా చేయాలి. కంకరతేలి, మట్టి కొట్టుకొని పోయి ప్రమాదకరంగా మారిన రోడ్డులో సుమారు 150 మీటర్లు సీసీ రోడ్డు వేయాలి. ఇక్కడ కేవలం రోడ్డుపై మట్టి పోసి వదిలేశారు. దీంతో ఇక్కడ సీసీ రోడ్డు పనులు చేయలేదు. కాంట్రాక్టర్‌కు చేసిన పనులకు బిల్లులు విడుదల కాలేదని మధ్యలోనే పనులు నిలిపేశారని సంబంధిత అధికారులు చెబుతున్నారు. దీంతో పనులు మధ్యంతరంగా నిలిచిపోయాయి. నేడు వర్షాలు రావడంతో పోసిన మట్టి కొట్టుకొని పోయి రోడ్డంతా వర్రెలు కొట్టింది. దీంతో రాక పోకలకు ఇబ్బందిగా మారింది. కాంట్రాక్టర్ చేసిన పనులు కూడా సక్రమంగా చేయలేదని స్థానికులు వాపోయారు. దీంతో ఆ రోడ్డు మట్టికొట్టుకపోయి మరింత అధ్వాన్నంగా తయారైంది. ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న ఈ రోడ్డును బాగు చేయాలని ఆయా జిల్లాల సరిహద్దు గ్రామాల ప్రజలు కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో పనులు చేయించి రాక పోకలకు ఇబ్బందులు లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి

గౌడ సంఘం మండల అధ్యక్షుడు మల్లేశ్‌గౌడ్


మాట్లాడుతున్న మల్లేశ్‌గౌడ్

కడ్తాల్: రాష్ట్ర ప్రభుత్వం గీత కార్మికుల సంక్షేమం, గీత వృత్తి రక్షణకు పెద్దపీట వేస్తుందని, గౌడ సంఘం మండల అధ్యక్షుడు మాలే మల్లేశ్‌గౌడ్, పాలకూర్ల రాములుగౌడ్ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. కల్లు గీత కార్మికులు తాటి చెట్టు ఎక్కే క్రమంలో ప్రమాదాల బారిన పడకుండా, ప్రభుత్వం లైఫ్ సేఫ్ కిట్స్ పంపిణీకి శ్రీకారం చుట్టడం అభినందనీయమని పేర్కొన్నారు. గీత కార్మికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర వ్యాప్తంగా కల్లు గీత కార్మికులకు కాటమయ్య రక్షణ కిట్లను అందించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జిల్లాలోని అబ్దుల్లాపూర్‌మెట్ మండలం లష్కర్‌గూడలో ఆదివారం ఉదయం 11 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గంలోని గౌడ సోదరులు గీత కార్మికులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి

సీఐ నాగరాజు గౌడ్



మాట్లాడుతున్న సీఐ నాగరాజు గౌడ్

మాడ్గుల: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని మాడ్గుల సీఐ నాగరాజు గౌడ్ పేర్కొన్నారు. మాడ్గుల సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆయన మాడ్గుల పోలీస్ స్టేషన్‌లో శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలు న్యాయం కోసం నేరుగా పోలీస్ స్టేషన్‌ను సంప్రదించొచ్చన్నారు. పోలీసులు ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉంటారని, బాధితులకు పోలీస్ శాఖ అండగా ఉంటుందని ఆయన చెప్పారు. నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయని, ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటునకు ప్రజలు సహకరించాలని ఆయన కోరారు. అక్రమంగా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పాఠశాల ప్రారంభించేందుకు

ఏర్పాట్లు పూర్తి

- డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి
- 17న కేజీబీవీని ప్రాంభించకపోతే ఆమరణదీక్ష : బీఆర్‌ఎస్ నాయకులు


మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహ

కడ్తాల్: అధునాతన సదుపాయాలతో నూతనంగా నిర్మించిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని ఈ నెల 17న ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహులు పేర్కొన్నారు. ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, రాష్ట్ర ఐటీ, శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు మల్లు రవి, జిల్లా కలెక్టర్ శశాంక ముఖ్య అతిథులుగా హాజరుకానున్నట్లు వారు చెప్పారు. శనివారం మండల కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగానికి అత్యంత ప్రాధాన్యత నిస్తుందని పేర్కొన్నారు. విద్యా సంస్థల్లో విద్యార్థులకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రత్యేకించి కల్వకుర్తి నియోజకవర్గాన్ని ఎడ్యూకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కమ్లీమోత్యానాయక్, డీసీసీ ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, మాజీ జెడ్పీటీసీ శ్రీనివాస్‌రెడ్డి, గిరిజన సేవాసంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, జిల్లా నాయకులు భాస్కర్‌రెడ్డి, నాయకులు చందోజీ, జహంగీర్‌అలీ, లక్ష్మయ్య, బాలరాజు, లక్పతినాయక్, మల్లేశ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాలను ప్రారంభించాలని బీఆర్‌ఎస్ నిరసన..

ఈ నెల 17న కేజీబీవీ పాఠశాలను ప్రారంభించకపోతే విద్యార్థుల భవిష్యత్తు కోసం ఆమరణ దీక్షకైన సిద్ధమని బీఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. విద్యా సంవత్సరం ప్రారంభమై నెల రోజులు దాటినా నిర్మాణం పూర్తయిన పాఠశాలను ప్రారంభించకపోవడం బాధాకరమన్నారు. శనివారం మండల కేంద్రంలో అంబేద్కర్ విగ్రహం వద్ద బీఆర్‌ఎస్ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడారు. మండల కేంద్రంలో విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేజీబీవీ పాఠశాల నిర్మాణానికి రూ.3.50 కోట్లు నిధులు మంజూరు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

దీక్ష భగ్నం..

అంబేద్కర్ విగ్రహం వద్ద దీక్ష చేస్తున్న బీఆర్‌ఎస్ నాయకుల దీక్షను పోలీసులు అడ్డుకున్నారు. తాము న్యాయబద్ధంగా నిరసన వ్యక్తం చేస్తుంటే అడ్డుకోవడం బాధాకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పూనుకోవడం హేయమైన చర్యనన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఇలాంటి అణచివేత దొరణి తగదని విమర్శించారు. కేజీబీవీ పాఠశాలకు సంబంధించి మౌలిక వసతులు, సౌకర్యాలు, ఏర్పాట్ల గురించి, గతంలో జిల్లా స్థాయిలో జెడ్పీ సమావేశాల్లో సమస్యలను సభ దృష్టికి తీసుకువచ్చి, సమస్యల పరిష్కారానికి అప్పటి జెడ్పీటీసీ దశరథ్‌నాయక్ ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. విద్యార్థుల పక్షాన రాజ్యాంగ బద్దంగా శాంతియుతంగా నిరాహార దీక్ష చేయడానికి సిద్ధమైన బీఆర్‌ఎస్ శ్రేణులను పోలీసులతో కట్టడి చేయడం ఎంత వరకు సమంజసమని వారు ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ దశరథ్‌నాయక్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పరమేశ్, సింగిల్‌విండో చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, మాజీ వైస్‌ఎంపీపీ ఆనంద్, మాజీ సర్పంచ్‌లు లక్ష్మీనర్సింహరెడ్డి, యాదయ్య, సులోచన, దేవా, మాజీ ఎంపీటీసీలు గోపాల్, ప్రియారమేశ్, నాయకులు లాయక్‌అలీ, పాండు, రమేశ్, వెంకటయ్య, కృష్ణ, మహేశ్, అంజి, శ్రీకాంత్, యాదగిరి, గణేశ్, తిరుపతి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులు, నాయకులు